క్లుప్తంగా

నేటి నుంచి బంగారుపాపమ్మ ఉత్సవాలు


బంగారుపాపమ్మ

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట వాసుల ఆరాధ్య దేవతైన బంగారుపాపమ్మ ఉత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ అమావాస్య వరకూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామానికి చెందిన తన్నీరు వంశస్తుల ఇలవేల్పుగా కొలిచే బంగారుపాపమ్మకు 210 ఏళ్ల చరిత్ర ఉంది. ఐదు రోజులు నిర్వహించే ఉత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంజరపు అబ్బు, ఉపాధ్యక్షుడు తొండెపు రమేష్ సోమవారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వారు చెప్పారు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో రంగుల రాట్నాలు, జెయింట్ వీల్, ట్రైన్ తదితరాలను ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఇప్పటికే లైటింగ్, చలువ పందిళ్లు ఏర్పాట్లు పూర్తి చేశారు.

లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ


లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సమాఖ్య సిబ్బంది

తాళ్లపూడి: లింగ ఆధారిత వివక్షకు, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తాళ్లపూడి మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళలు ప్రతిజ్ఞ చేశారు. వెలుగు ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మంగాయమ్మ మాట్లాడుతూ జెండర్ ఆధారిత వివక్ష చేయడంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో లీలావతి, మహిళా సమాఖ్య కార్యాలయ సిబ్బంది, సీసీలు, వీఏలు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

కొవ్వూరు: పట్టణంలో మంగళవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్టు మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సోమవారం తెలిపారు.26న ఔరంగాబాద్ సచివాలయం-6, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, 27న ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, 28న ఏఎస్‌జెడ్పీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, 29న ఆవుల వారి స్ట్రీట్ సచివాలయం-10లోనూ ఈ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

నిడదవోలు: పట్టణానికి చెందిన కంఠంశెట్టి శివయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం లయన్స్ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ మంగళవారం రూ.10,000 ఆర్థిక సాయం చేసింది. స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో లయన్ జిల్లా కో-ఆర్డినేటర్ రంగా వెంకటేశ్వరరావు ఈ ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జేష్ట వెంకటేశ్వరరావు, కార్యదర్శి బేతిన రామస్, కోశాధికారి బండి రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటా సర్వే



అన్నవరప్పాడులో ఇంటింటా క్యాన్సర్ సర్వే పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: క్యాన్సర్ వ్యాధిపై అన్నవరప్పాడులో సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల క్యాన్సర్ రోగులు ఎక్కువై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అందుకే ఇంటింటా సర్వే జరిపి, గుర్తించిన క్యాన్సర్ రోగులకు చికిత్స అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ సందర్భంగా సర్వే బృందం ప్రతి ఇంటివద్దా బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. సర్వేలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

కొవ్వూరు: వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మండలంలో పలు గ్రామాల వారికి అందిన చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఐ.పంగిడికి చెందిన చౌటుపల్లి వెంకటరమణకు రూ.41,048, దొమ్మేరుకు చెందిన వేల్పూరి జానకికి రూ.30,028, పెనకమెట్టకు చెందిన గూడపాటి గంగరాజుకు రూ.33 వేలు, కాపవరానికి చెందిన పేరాబత్తుల వీర వెంకట సత్యనారాయణకు రూ.43,025 అందజేశారు. కార్యక్రమంలో పొట్రు సిద్ధూ, మాజీ ఎంపీపీ పీకే రంగారావు, కోమటి కృష్ణంరాజు, కొప్పాక విజయ్ కుమార్, గారపాటి శ్రీదేవి, సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఆశలకు సమాధి

- తేల్చేసిన కూటమి ప్రభుత్వం
- రూ.10 వేల పారితోషికం ఇస్తామని ఎన్నికల ముందు హామీ
- అధికారంలోకి వచ్చాక మోసగించిన సీఎం చంద్రబాబు
- కొవ్వూరు డివిజన్‌లో పని చేసిన 3,182 మంది వలంటీర్లు


సమిశ్రగూడెంలో ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు, స్థానిక నాయకులు (ఫైల్)


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో కోవిడ్ సమయంలో సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు (ఫైల్)

నిడదవోలు రూరల్: గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే పొద్దుపొడవక ముందే పెన్షన్‌దారులకు పింఛన్లు అందేవి. సంక్షేమ ఫలాలూ లబ్ధిదారుల గడప వద్దకే వచ్చేవి. అదంతా వలంటీర్లు గొప్పదనం. కోవిడ్ సమయంలో సొంతవాళ్లే కుటుంబీకులను పట్టించుకోని పరిస్థితుల్లో తాము న్నామంటూ సేవలందించిన ఘనత వలంటీర్లది. మీరు చేస్తున్న సేవలకు రూ.5 వేల గౌరవ వేతనం ఏం సరిపోతుంది? తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, కూటమి నాయకులు తీపి మాటలు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, తమకిచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకుంటాడని ఇప్పటివరకూ గంపెడశతో వలంటీర్లు ఎదురు చూశారు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వలంటీర్లను తమ ప్రభుత్వం కొనసాగించడం లేదని స్పష్టంచేశారు. వారిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకుందని, కూటమి ప్రభుత్వంలో వీరిని కొనసాగించలేమని తేల్చి చెప్పేశారు. దీంతో ఎన్నికలపుడు కూటమి నేతలు హామీ నీటిమూటేనని మరోసారి తేటతెల్లమైంది. ఎప్పటికైనా తమను వలంటీర్లుగా కొనసాగించకపోతారా అనే ఆశతో ఉన్న వలంటీర్ల ఆశలు అడియాశలుగా మారాయి. వలంటీర్ల విలువ ఇప్పుడు జనానికి బాగా అర్థమైంది. నాడు కోవిడ్ కష్టకాలంలో వలంటీర్ల సేవలను కూటమి నేతలు తప్పుబట్టలేదు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వలంటీర్ల విషయంలో చంద్రబాబు చేసిన రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

వలంటీర్ల సేవలను మరువగలమా

కొవ్వూరు డివిజన్ పరిధిలోని కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో 197 గ్రామ సచివాలయాలు ఉండగా 3,182 మంది వలంటీర్లు ఉండేవారు. వీరంతా ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారులకు పింఛన్లు ఠంచనుగా అందించేవారు. సచివాలయ పరిధిలో అన్ని రకాల సేవలు వీరి ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే చేరేవి. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేసేవారు. ఎన్నికల ముందు టీడీపీ నాయకుల వేధింపులు, వలంటీర్లను స్లీపర్ సెల్స్, టెర్రరిస్టులని విమర్శించడం, సోషల్ మీడియాలో వలంటీర్లను అవమానపరిచారు. దీంతో కొంతమంది వలంటీర్లు రాజీనామా చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వలంటీర్లను ఏర్పాటు చేస్తుందని ప్రజలు భావించారు. అయితే ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థకే మంగళం పాడేశారు.

కొవ్వూరు డివిజన్‌లో మండలాలవారీగా వలంటీర్ల వివరాలు

మండలం	సచివాలయాలు	వలంటీర్లు
చాగల్లు	18	257
దేవరపల్లి	21	310
గోపాలపురం	18	262
కొవ్వూరు పట్టణం	10	236
కొవ్వూరు మండలం	19	293
నల్లజర్ల	22	350
నిడదవోలు పట్టణం	13	210
నిడదవోలు మండలం	22	316
పెరవలి	20	389
తాళ్లపూడి	15	210
ఉండ్రాజవరం	19	349
మొత్తం	197	3,182

మాట తప్పిన చంద్రబాబు



ఎన్నికలపుడు వలంటీర్లను కొనసాగిస్తామని సీఎం చంద్రబాబు మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాకా తప్పారు. ఎన్నికల్లో గెలవడానికి ఇన్ని హామీలిచ్చి మోసం చేయడం తగునా. వలంటీర్లను నాయకులను తయారు చేస్తానని మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారమే వలంటీర్‌గా చేస్తున్న నాకు మా పంచాయతీ సర్పంచ్‌గా ప్రజలకు సేవచేసే అవకాశం వచ్చింది.
– దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, సర్పంచ్, సమిశ్రగూడెం

హామీ నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, పారితోషకం రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రజలకు అన్నిరకాల సేవలు అందించిన వలంటీర్లను ఉపయోగించుకుని ఇపుడు వదిలేయడం దారుణం.
– సిర్రా బుల్లియ్య, సమిశ్రగూడెం

వలంటీర్లను నియమించాలి



గత ప్రభుత్వంలో రేషన్‌కార్డులు, వివిధ ధ్రువీకరణ పత్రాలు ఏం కావాలన్నా వలంటీర్లకు చెబితే వారే సచివాలయానికి వెళ్లి మా పనులు పూర్తిచేసేవారు. దీంతో వృద్ధులతో పాటు దివ్యాంగులకు కష్టాలు ఉండేవి కావు. కూటమి ప్రభుత్వం పునరాలోచించి మళ్లీ వలంటీర్లను నియమించాలి.
–అహ్మద్ హుస్సేన్, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి, సమిశ్రగూడెం

ముగిసిన శ్రీనివాసుని పవిత్రోత్సవాలు


అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు తెల్లవారుజామున వేద పండితులు స్వామివారికి మంత్రోచ్ఛరణలతో పాటు అభిషేకం నిర్వహించారు. అనంతరం పవిత్రోత్సవాల చివరి అంకానికి అంకురార్పణ చేశారు. ఉదయం పవిత్రోత్సవ సంకల్పంతో పాటు పలు రకాల పూజాదికాలు నిర్వహించారు. ఈ పూజలను మీసాల రాధాకృష్ణ కుటుంబం నిర్వహించారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వరరావు వర ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ, యాగాగ్ని కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పవిత్రోత్సవాలను స్థానికులే గాకుండా చుట్టుపక్కల గ్రామలైన కడింపాడు, పిట్టల వేమవరం, దొంగరావిపాలెం, ఖండవలి ప్రజలు తిలకించారు. ఖండవల్లి రాజేశ్వరరావు, వర ప్రసాదాచార్యులను దేవస్థానం ఈఓ మీసాల రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.

ఉమా విశ్వేశ్వరునికి వార్షికోత్సవ పూజలు


అన్నవరప్పాడులో ఉమా విశ్వేశ్వరస్వామి వారి కల్యాణం


గోపాలపురం వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శివ లింగాకారంలో 1008 వత్తుల దీపోత్సవం

పెరవలి: అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కనే గల ఉమావిశ్వేశ్వస్వామి వారి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్తిక సోమవారం కావడంతో మహిళలు వేకువ జామునే ఆలయానికి వచ్చి కార్తిక దీపాలు వెలిగించారు. తెల్లవారుజామున ఆలయంలో గణపతి హోమం ప్రారంభమైంది. వేదపండితుల మంత్రోచ్ఛరణతో గ్రామం మార్మోగింది. 108 మంది దంపతులు రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని భక్తుల సమక్షంలో వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో మూడు వేల మంది భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం స్వామి,అమ్మవార్లకు లక్ష పత్రి పూజ నిర్వహించారు.

శివాలయంలో దీపోత్సవం

గోపాలపురం: కార్తిక మాసంలోని చివరి సోమవారం కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. గోపాలపురం, దొండపూడి, జగన్నాథపురం, చిట్యాల గ్రామాల శివాలయాల్లో 100 శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.


దేవరపల్లి వరసిద్ధి వినాయకుని ఆలయం వద్ద లక్ష దీపార్చన

దేవరపల్లిలో లక్ష దీపార్చన

దేవరపల్లి: స్థానిక సీబీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద సోమవారం రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకూ లక్ష దీపార్చన వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు ఎక్కువ మంది మహిళలు హాజరై దీపారాధన చేశారు. అనంతం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కె. వెంకటేశ్వరరావు, వెంకటరమణ దంపతులు పూజలు నిర్వహించారు.

సీనియర్స్ మహిళల, పురుషుల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక


జిల్లా సీనియర్ మహిళల కబడ్డీ జట్టు


జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీనియర్స్ మహిళల, పురుషుల కబడ్డీ జట్లను ఆదివారం తణుకు జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై. శ్రీకాంత్ తెలిపారు. మహిళల జట్టుకు ఎంపికైన వారిలో ఎంహెచ్ ప్రియదర్శిని (జంగారెడ్డిగూడెం), ఎం.దేవిక (ఉండి),పి.కావ్య (జంగారెడ్డిగూడెం), సౌమ్య(జంగారెడ్డిగూడెం), సీహెచ్ నవ్య(తాడేపల్లిగూడెం), వి.జ్యోతి (తణుకు), వై.గాయత్రి (నబీపేట), ఎం.సుశీల(అనంతపల్లి), కె.కల్యాణి (కోడూరుపాడు), పి.చందన (తంగెళ్ళవారిగూడెం),కె.లావణ్య (జంగారెడ్డిగూడెం), సీహెచ్ స్వాతి (ఏలూరు)సీహెచ్ నవ్య (తాడేపల్లిగూడెం), పి.హిందుప్రియ (తెల్లంవారిగూడెం), బి.చిన్నారి(అనంతపల్లి), ఎం.మౌనిక (జీలుగుమిల్లి) ఎంపికయ్యారు.

పురుషుల జట్టుకు టీకేఎస్ఆర్ తేజ (తోలేరు), జి.శ్రీకాంత్ (తణుకు), దిలీప్(చిక్కాల), ఎస్ సాగర్ (మందపాక), పి.గోపాలకృష్ణ (చిక్కాల),ఆనంద్‌బాబు(భీమవరం), పి.రామకృష్ణ (చింతలపూడి), జె. వెంకటేష్ (చింతలపూడి) పీవీవీపీ స్వామి(వీరవాసరం), ఎస్ సాయి ఫణేంద్ర (సిద్ధాపురం), ఏ.పవన్‌కుమార్ (అత్తిలి),జేఎస్‌వీడీ వరప్రసాద్ (తోలేరు), పి.సచిన్ (యల్లమిల్లి), కె.భరత్(బుట్టాయగూడెం), జి.మహేష్‌రెడ్డి (ఏలూరు) ఎంపికయ్యారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిన వారు డిసెంబరు 5 నుంచి 8 వరకూ ఒంగోలు జిల్లా సంతనూతలపాడులో నిర్వహించే 71వ రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారన్నారు. సెలక్షన్స్ కమిటీ సభ్యులుగా వై.శ్రీకాంత్, కె.రంగారావు, ఎం.గంగారావు వ్యవహరించారు.వ్యాయామోపాధ్యాయులు బి.జాన్సన్, పీఎస్ఎస్ మల్లేశ్వరరావు, టి.సత్యవేణి, ఎస్ సూర్యనారాయణ, ఏ నాగేశ్వరరావు, కె.బాబూరావు పాల్గొన్నారు.

సాదాసీదాగా చాగల్లు మండల సమావేశం

చాగల్లు: చాగల్లు మండల పరిషత్ పాలకవర్గ సమావేశాన్ని సోమవారం ఎంపీపీ మట్టా వీరస్వామి ఆధ్యక్షతన సాదాసీదాగా నిర్వహించారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయం తెలిసిందే. దాంతో ఎటువంటి చర్చలు, అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు, ఆమోదాలు లేకుండానే సమావేశాన్ని నిర్వహించినట్టు ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చెల్లింకుల శ్రీవిజయ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కారు ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు: పట్టణానికి చెందిన వెలిగట్ల కార్తీక్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన స్కోడా కారును ఈనెల 22వ తేదీ రాత్రి ధ్వంసం చేశారు. పాత కక్షలను పురస్కరించుకుని పట్టణానికే చెందిన మల్లాడి అనుదీప్ వర్మ, మొగంటి రంజిత్‌కుమార్ అనే వారు ఈ చర్యకు పాల్పడ్డారు. వారిద్దరూ రాళ్లు వేసి కారు ముందు అద్దం పగల గొట్టడంతో పాటు బ్యానెట్‌ను డ్యామేజీ చేశారు. దీనిపై కార్తీక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కోర్టు ఉత్తర్వులను అనుసరించి, వారిద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు.

ప్రేమ, క్షమ క్రీస్తు సందేశాలు

నూతన చర్చి ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి వనిత



సింగరాజుపాలెం చర్చి ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: ప్రేమ, క్షమ క్రీస్తు సందేశాలని, అలాంటి క్రీస్తు బోధనలతో మానవుడు సన్మార్గంలో నడవాలని మాజీ హోంమంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని సింగరాజుపాలెం గ్రామంలో పెనుమాక జాన్ మాథ్యూస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన చర్చిని సోమవారం మధ్యాహ్నం వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏసు ప్రభువు ప్రేమ, కరుణలకు ప్రతిరూపమన్నారు. ఆయనను ప్రార్థిస్తే కష్టాలు,నష్టాలు తొలగిపోయి, అన్నీ శుభాలే జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, క్రైస్తవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరావు, పాస్టర్ పి.శామ్యూల్‌జాన్, బ్రదర్ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

'గంధం'కు డీటీఎఫ్ సంపూర్ణ మద్దతు


టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి నారాయణరావుకు మద్దతు లేఖ అందిస్తున్న నరహరి

నల్లజర్ల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంధం నారాయణరావు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన నల్లజర్ల మండలంలో పర్యటించారు. ఉపాధ్యాయుల సమావేశంలో నారాయణరావుకు డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కౌణతం నరహరి ఆయనకు మద్దతు లేఖ అందజేశారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శేషబ్రహ్మం, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కాంతారావు, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ త్రినాథరావు, జిల్లా కార్యదర్శి అప్పలాచారి, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. శ్రీనివాసరావు, ఎస్. గోవిందరాజులు పాల్గొన్నారు.

శివాలయాలు.. భక్తజన సంద్రాలు


కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో భక్తుల రద్దీ

- కళకళలాడిన కొవ్వూరు గోష్పాద క్షేత్రం
- శివలింగానికి అభిషేకాలు
- జలాశయాల్లో పుణ్య స్నానాలు ఆచరించి, కార్తిక దీపాలు వదిలిన మహిళలు
- పలుచోట్ల అన్న సమారాధనలు

కొవ్వూరు: కార్తిక మాసంలోని చివరి సోమవారం కావడంతో గోష్పాద క్షేత్రానికి తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు వచ్చి గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తజనంతో ఈ క్షేత్రం కళకళ లాడింది. స్నానాలు ఆచరించాక ఒడ్డునే పూజలు చేశాక, నదిలో కార్తిక దీపాలు విడిచిపెట్టారు. స్నానఘట్టంలోని శివ లింగానికి గోదావరి జలాలతో భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం సుందరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పట్టణంలో సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వస్వామి ఆలయంలోను, పంచాయతన శివాలయంలోను, పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలోను, దొమ్మేరు ఉద్దండ మల్లికార్జున స్వామి, వాడపల్లి శివాలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. గోష్పాద క్షేత్రంలో 360 వత్తులతో మహిళలు దీపారాధనలు చేశారు.


నిడదవోలు సోమేశ్వరస్వామి ఆలయంలో ఆకాశదీపం కార్యక్రమంలో భక్తులు

నిడదవోలు: స్థానిక చినకాశి రేవులో వేకువజామునే గంగా స్నానాలు ఆచరించిన భక్తులు శైవ క్షేత్రాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. స్థానిక పురాతన రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లకు వేకువజామున అర్చకులు నిత్యాభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. రిటైర్డ్ తెలుగు పండితుడు పొన్నా కృష్ణబాబు చెప్పిన శివ పురాణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేద పండితుల మంత్రాల నడుమ భక్తులు ఆకాశదీపం కార్యక్రమం నిర్వహించారు. ఆలయాల ఈవోలు సోమాల శివ, నామా సూర్యప్రకాశ్, అర్చకులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: భక్తులు తెల్లవారుజాము నుంచే మండలంలోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. తాడిమళ్లలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, రామలింగేశ్వరస్వామి, కంసాలిపాలెంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ఉనకరమిల్లిలో ఉమా లింగేశ్వర స్వామి, సమిశ్రగూడెంలో పర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.


పాలంగిలో రామలింగేశ్వర స్వామి గుడిలో ఆకాశ దీపాలు


బ్రాహ్మణగూడెంలో బాలరామలింగేశ్వరస్వామి

కాటకోటేశ్వరంలో శివాలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనకు భారీగా భక్తులు తరలి వచ్చారు.

ఉండ్రాజవరం: మండలంలో ప్రసిద్ధి గాంచిన పాలంగి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు వి.రఘు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గంగాబాల త్రిపుర సుందరీదేవి అమ్మ వారికి కుంకుమార్చనలు చేశారు. సాయత్రం ఆలయంలో ఆకాశ దీపాలు వెలిగించారు. ఉండ్రాజవరంలోని గోకర్ణేశ్వరస్వామి, మోర్త శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించి, పూలతో విశేషంగా ఆలకరించారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో పాటు శివమాలధారులు కూడా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చాగల్లులోని రాజరాజేశ్వరస్వామి, మార్కొండపాడు ఉమామార్కండేయస్వామి, ఊనగట్ల ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. చిక్కాల, దారవరం, నందిగంపాడు, కలవలపల్లి గ్రామాల శివాలయాల్లో స్వామివారికి అభిషేకాలు జరిపించారు.

అన్న సమారాధన

నిడదవోలు: కార్తిక మాసంలోని చివరి సోమవారం కావడంతో స్థానిక బసిరెడ్డి పేటలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన చేశారు.కార్యాక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, జనసేన పట్టణశాఖ అధ్యక్షుడు రంగా రమేష్, మద్దిపాటి ఫణీంద్ర పాల్గొన్నారు.